రాజవొమ్మంగి ఎంఇఒ పోస్టు భర్తీ చేయాలి

ప్రజాశక్తి- పాడేరు : క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంతో ఖాళీగా ఉన్న రాజవొమ్మంగి మండల విద్యాశాఖాధికారి-1 పోస్టును తక్షణమే భర్తీ చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు, జిల్లా సహా అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి పి దేముడు కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎంఇఒ-1 డిడిఒ బాధ్యతలు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో మండలంలోని 84 మంది ఉపాధ్యాయులకు జీతభత్యాలకు, ఉపాధ్యాయుల ఇఎంఐ, ఇతర ఫీజులు చెల్లించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అంతేకాక మండలంలో పాఠశాలల నిర్వహణపై పర్యవేక్షణకు అవకాశం లేకుండా పోతుందన్నారు. ఈ నేపథ్యంలో మండలంలో నెలకొన్న పరిస్థితులను జిల్లా విద్యాశాఖాధికారి గుర్తించి, వెంటనే ఎంఇఒ పోస్టు భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు

వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫాతో
83 జంటలకు రూ.78.75 లక్షల లబ్ధి

● జిల్లా కలెక్టర్ విజయసునీత

నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలోని 83 జంటలకు వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా కింద రూ.78.75 లక్షలు లబ్ధి చేకూరిందని జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత వెల్లడించారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ, వికలాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలలోని ఆడపిల్లలకు కల్యాణమస్తు, ముస్లిం మైనార్టీ ఆడపిల్లలకు షాదీతోఫా కింద ఆర్థికసాయాన్ని సంబంధిత లబ్ధిదారుల తల్లుల ఖాతాల్లో ముఖ్యమంత్రి జమ చేశారన్నారు.

ముఖ్యమంత్రి బటన్ నొక్కి వివాహ ప్రోత్సాహకాలను లబ్ధిదారులకు అందించిన కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, కలెక్టర్ ఎం.విజయ సునీత, ఇతర అధికారులు తిలకించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కులాంతర వివాహాలు చేసుకున్న 83 జంటలకు రూ. 78.75 లక్షలు జమచేయడం జరిగిందన్నారు. నియోజకవర్గాల వారీగా చూసుకుంటే అరకు వ్యాలీ నియోజకవర్గంలో 32జంటలకు రూ.32.50లక్షలు, పాడేరులో 20 జంటలకు రూ.18.85 లక్షలు, రంపచోడవరంలో 31 జంటలకు రూ.27.40 లక్షలు జమ చేశారన్నారు.

మహిళలకు 18ఏళ్ళు, మగవారికి 21ఏళ్లు నిండిన తరువాతనే వివాహం చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే కల్యాణమస్తు, షాదీతోఫా కింద లబ్ధిపొందాలంటే తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణత కావాలని సూచించారు. ఈ పథకాల కింద లబ్ధిపొందేందుకు నిర్దేశించిన నిబంధనలతో ప్రతిఒక్కరూ కనీసం పదవ తరగతి వరకు చదవడంతోపాటు బాల్యవివాహాలను నిర్మూలించాలన్న ప్రభుత్వ ఆలోచన ఉందన్నారు.

స్థానిక ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పిల్లలను చదివించడం, వారికి గౌరవప్రదంగా పెళ్లి జరిపించడమనే సామాజిక బాధ్యతను వారి తల్లిదండ్రులు సక్రమంగా నిర్వర్తించేందుకు వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్, వైసిపి ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందన్నారు. పిల్లల చదువు, పెళ్లి తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండాలనేఉద్దేశ్యంతోనే దీన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిపొందిన నూతన వధూవరులకు ఎమ్మెల్యే వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు జి.జనార్ధనరావు, కల్యాణమస్తు కోఆర్డినేటర్ ఎస్.జగన్మోహన్, పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

టిడిపిలోకి చేరుతున్న వారిని కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దొన్నుదొర

ప్రజాశక్తి -హుకుంపేట: టిడిపితోనే గిరిజన ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యలు పరిష్కారమౌతున్నాయని టిడిపి అరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి సివేరి దొన్నుదొర అనానరు. మంగళవారం మండలంలోని మత్స్యపురం పంచాయతీ బూరుగులు గ్రామంలో పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి, జనసేన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. వైసిపి నిరంకుశ పాలనలో ప్రజలు పడుతున్న అష్టకష్టాలను వివరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, గిరిజన సమస్యలపై తనకు పూర్తి అవగాన ఉందని, గెలిస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారానికి తెలుగుదేశం ప్రభుత్వం నూతన ప్రణాళికను రచించిందన్నారు.తాగునీరు, రహదారులు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా వైసిపి నుంచి 80 కుటుంబాలు టిడిపిలో చేరగా, వారికి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు కార్యక్రమంలో బాకూరి సర్పంచ్ బాకూరు వెంకటరమణ, బొడ్డాపుట్టు సర్పంచు పాడి బాలన్న, అచ్చులమ్మ అండిబ సర్పంచి సామర్ల సత్యనారాయణ, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కిల్లో సాయిరాం, పద్మాపురం మాజీ సర్పంచ్ సోమల ఓనాది, నాయకులు బోయిని శంకర్ నాయుడు, బొడ్డ శ్యామ్ తాడిపుట్ సర్పంచ్ సోమేలి లక్ష్మయ్య, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కిల్లో సాయి రామ్, మత్స్యపురం మాజీ సర్పంచ్ కొర్రా రాజారావు,హుకుంపేట మాజీ ఎంపీటీసీ పి.లక్ష్మయ్య, పెదలబుడు వైస్ సర్పంచ్ పాడి చందు, పద్మపురం మాజీ సర్పంచ్ సోమేల ఓనది, మాడగడ మాజీ ఎంపీటీసీ వంతల దేవి వెంకట రావు, టిడిపి నాయకులు బోయిని శంకర్, బొడ్డ శ్యాం, కొర్రా సంతోష్, నాగేశ్వరరావు, కొర్రా భీమన్న, పొట్టంగి పండన్న, బూత్ ఇంచార్జ్ మోహన్ పాల్గొన్నారు.

జిఒ 11 అమలుకు వినతి



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ కార్యదర్శులు

ప్రజాశక్తి - చింతపల్లి : సచివాలయ కార్యదర్శులను పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్లపై నియమించేందుకు జారీ చేసిన జిఒ 11ను పటిష్టంగా అమలు చేయాలని సచివాలయం కార్యదర్శులు కోరాబు శివకుమార్, లోచలి చిన్నం నాయుడు కోరారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ వి వీర సాయిబాబాకు వినతి పత్రాన్ని సమర్పించారు. దీనిపై ఎంపిడిఒ వీర సాయిబాబు స్పందిస్తూ, సచివాలయ కార్యదర్శుల వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సచివాలయాల కార్యదర్శులు డిప్పల రమణ, కిల్లో గాంధీ, గెమ్మెల బాలకష్ణ, హేమకాంత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి నియామకాల్లో గిరిజనులకు అన్యాయం

● జిఒ 3 రద్దుతో నష్టపోతున్న ఎస్‌టి నిరుద్యోగులు

● సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి- అనంతగిరి: ఏజెన్సీ ప్రాంతంలో జిఒ3 ప్రకారం డిఎస్‌సి పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ గిరిజనులకు న్యాయం చేయాలని అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో 6100 టీచర్ పోస్టులకు గాను అందులో ఎస్‌టిలకు నామమాత్రపు పోస్టులను కేటాయించడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు జిఒ3ని రద్దు చేయడం, తర్వాత దీని పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టకపోవడం వల్ల గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గిరిజనులకు రిజర్వేషన్ ప్రకారం పోస్టుల సంఖ్య తగ్గిపోగా, ఏజెన్సీలోని పోస్టులను గిరిజనేతరుల పరమయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇక ఐటిడిఎల వారీగా పరిశీలిస్తే అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ ఐటిడిఎ ప్రాంతంలో 175 పోస్టులను భర్తీ చేస్తుంటే, అందులో ఎస్‌టిలకు కేవలం ఏడు పోస్టులే దక్కనున్నాయి. అలాగే రంపచోడవరం చింతూరు ఏజెన్సీలో 205 పోస్టులకు గాను 10 పోస్టులు, మన్యం పార్వతీపురం జిల్లా సీతంపేట ఏజెన్సీలో 35 పోస్టులకు గాను ఆరు, కెఆర్ పురం ఐటిడిఎ పరిధిలో 70 పోస్టులకు గాను ఎనిమిది పోస్టులను మాత్రమే గిరిజనులకు కేటాయించారు. ఏజెన్సీకి 500 టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి కేవలం 38 పోస్టులతో సరిపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ఏజెన్సీలోని గిరిజనులకు 100శాతం ఉద్యోగా రిజర్వేషన్ కల్పిస్తున్న జిఒ 3ను సుప్రీంకోర్టు రద్దు చేయడంపై 2020 రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి మొత్తం 17 రివ్యూ పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం గిరిజన నేతరులకు కొమ్ము కాస్తూ డిఎస్‌సిలో గిరిజన నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.మరోపక్క ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు ఉద్యోగ రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం 5 షెడ్యూల్ క్లాజ్ 2 ప్రకారం చట్టబద్ధత కల్పిస్తామని ట్రైబల్ ఎడ్వైజర్ కౌన్సిల్ (టిఏసి)లో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజన సంక్షేమ శాఖ సిఫార్సు చేసినా, టిఏసి తీర్మానాన్ని కూడా కనీసం రాష్ట్ర ప్రభుత్వం గౌరవించలేదని ధ్వజమెత్తారు. జిఒ3ను రద్దు చేసిన తర్వాత అనేకసార్లు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించినా, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్చించలేదన్నారు.

రాజ్యాంగ పరంగా 1/70 చట్టం ప్రకారం స్థిర నివాసానికి అనుమతులు లేని 2 శాతం గిరిజనేతరులకు 98శాతం ఉద్యోగ అవకాశాలు ఎల కల్పిస్తారని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని గిరిజన నిరుద్యోగ,యువతీ యువకులు మేలుకోని ఉద్యమానికి ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య, మండల కార్యదర్శి సోమెల నాగులు, గెమ్మెల దేవన్న, వంతల బుద్రయ్య పాల్గొన్నారు

పాలిటెక్నిక్ విద్యతో మంచి భవిష్యత్తు

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేకర్

పాలిసెట్ వాల్‌పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి - పాడేరు :పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అతి తక్కువ కాలంలో, తక్కువ ఖర్చుతో మంచిభవిష్యత్తు పొందే అవకాశం ఒక్క పాలిటెక్నిక్ విద్యతోనే సాధ్యమని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ అన్నారు. మంగళవారం ఐటిడిఎ ప్రాంగణంలో పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, పదవ తరగతి తరువాత ఇంటర్మీడియట్, డిగ్రీ తదితర కోర్సులలో ఏమిచేయాలో భవిష్యత్తుకు గ్యారంటీ ఏమిటో తెలీని సందిగ్ధంలో ఉన్న విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సులను ఎంపిక చేసుకో వచ్చని సూచించారు. పాలిటెక్నిక్ కోర్సులు తక్కువ ఖర్చుతో పూర్తి చేయవచ్చని, ప్రభుత్వం నుంచి ఫీజు రియింబర్స్మెంట్, హాస్టల్ సదుపాయం ఉంటాయని వివరించారు మూడేళ్ళ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రత్యేకంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఉంటుందని, తద్వారా కళాశాల ప్లేస్మెంట్ దొరుకుతుందన్నారు. తక్కువ ఖర్చు, తక్కువ కాలంలో ఉపాధి దొరకటం పాలిటెక్నిక్ విద్య ద్వారానే సాధ్యమని స్పష్టం చేసారు. ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ ఐదవ తేదీ వరకు పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న జరుగుతుందన్నారు. పాలిసెట్ ఉత్తీర్ణులైన వారికి అర్హతల మేరకు పాలిటెక్నిక్ కళాశాలలో తగిన కోర్సుకు ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. పాలిటెక్నిక్ విద్యను ఎంచు కోవటం తెలివైన పనిగా పిఒ అభివర్ణించారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారికి వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గత ఏడాది వివిధ ప్లేస్ మెంట్ సంస్థల సహకారంతో పాలిటెక్నిక్ పూర్తి చేసిన వివిధ విద్యా సంవత్సరాలకు చెందిన ఐదు వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని గుర్తు చేసారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండల రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సలీం భాషా, పాడేరు పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్లు ఎస్. శాంతారావు, ఎం. మల్లేశ్వరరావు, పి.గిరీష్, పి.మాధవరావు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో స్కీముల వివరాలతో మినీ బోర్డులు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

గర్భిణులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్కీముల వివరాలతో ఏజెన్సీలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మినీ బోర్డులు ఏర్పాటు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో ఎడిఎంహెచ్ఒ, పిహెచ్‌సి వైద్యాధికారులతో నేరుగా, ఇతర కేంద్రాల్లో ఉన్న వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిఒ సమావేశం నిర్వహించారు. ఈ సంవత్సరం ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్ని ప్రసవాలు చేసింది, ఎన్ని ప్రసవాలకు సిజేరియన్లు చేసింది పిహెచ్‌సిల వారీగా ఆయన ఆరా తీశారు. ప్రస్తుతం ఒక్కొక్క పిహెచ్‌సిలో ఎంతమంది గర్భిణులు ఉన్నదీ, ఎంతమంది ప్రమాదకర గర్భిణులుగా గుర్తించారు, ఎంతమంది రిజిస్ట్రేషన్ చేసింది తెలుసుకున్నారు. గర్భిణులకు సంబంధించిన స్కీములకు ఫొటోలు తీసి అప్లోడ్ చేయాలన్నారు. జనని సురక్ష యోజన పథకం, ప్రధానమంత్రి మాతృత్వ పథకం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయిన వారికి పారితోషికాలు ఎంతమందికి ఇచ్చింది ఆరా తీశారు. పిహెచ్‌సిల్లో బర్త్ వెయిటింగ్ హాల్లు ఎన్ని ఉన్నవి, అవి ఏవిధంగా పనిచేస్తున్నాయో తెలుసుకున్నారు. గ్రామాలలో సికిల్ సెల్ ఎనీమియా టెస్టులు చేయాలన్నారు. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం సికిల్ సెల్ ఎనీమియాకు సంబంధించిన కిట్లు ఎన్ని తీసుకెళ్లారు, ఎంతమందికి టెస్టులు చేశారో తదితర వివరాలు వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏడియంహెచ్ఓ డాక్టర్ జి.ప్రకాశం, వైద్యాధికారులు శిరీషా, రాధిక, వినోద్, నిరంజన్, సునీత, ఎంపీహెచ్ఓ పీటర్ పాల్గొన్నారు.

5వ షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం తేవాలి

ప్రజాశక్తి-సీలేరు

5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకు కల్పించే జీవో నెంబర్ 3ను సుప్రీం కోర్టు రద్దు చేసిన నేపథ్యంలో దాని స్థానంలో ఉద్యోగాల భర్తీ కోసం ఉద్యోగ నియామక చట్టం తేవాలని భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ముట్టడం రాజాబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీవో నెంబర్ 3 కారణంగా 100శాతం ఉద్యోగాలు షెడ్యూల్ ప్రాంతంలో స్థానిక గిరిజనులకు ఇస్తున్నారని గిరిజనేతరుడైన చేబ్రోలు లీలాప్రసాద్ సుప్రీంకోర్టు ఆశ్రయించడంతో కోర్టు జీవో నెంబర్ 3ని రద్దు చేసిందని పేర్కొన్నారు. కానీ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగాలు భర్తీ కోసం రాజ్యాంగంలో ఉన్న ఉద్యోగ నియామక చట్టం లేదా రెగ్యులర్ ఆర్టికల్ 244 (1) పేరా 5 (1) లేదా ఫైవ్ టు చేసినట్లయితే కోర్టు నుండి రక్షణ ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎమ్మెల్యేలు ఇప్పటికైనా తీర్మానం చేసి గవర్నర్‌కు పంపాలని డిమాండ్ చేశారు. తీర్మాన నమూనా ఆదివాసీ జేఏసీ తరఫున తయారు చేసి గిరిజన సలహా మండలి సభ్యులైన గిరిజన ఎమ్మెల్యేలకు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. అయినా ఆదివాసీ ఎమ్మెల్యేలు గిరిజన సలహా మండలిలో ఎటువంటి తీర్మానం చేయలేదని విచారం వ్యక్తం చేశారు. నిజానికి 5వ షెడ్యూల్ ప్రాంతానికి అధిపతి గవర్నర్ కాబట్టి ఆదివాసీలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి చట్టాలు, హక్కులు, జీవోలు కావాలో గిరిజన సలహా మండల్లో తీర్మానం చేసి గవర్నర్ ఆమోదం పొందవచ్చునని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం, కినపర్తి పంచాయతీ చుట్టుబంద గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలోని తాగునీటి పథకం మోటారు మరమ్మతుకు గురై, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు.

తాగునీటి కోసం బిందెలతో నిరీక్షిస్తున్న చుట్టు బంద గ్రామస్తులు

రేగులపాడు పాఠశాలను సందర్శించిన సిపిఎం ప్రజాప్రతినిదులు

మిడ్డేమీల్స్‌కు 4 నెలలుగా అందని రేషన్ బియ్యం

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని రేగులపాడు పాఠశాలతో పాటు పలు పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సంబంధించిన రేషన్ బియ్యం నాలుగు నెలలుగా ఇవ్వడం లేదని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య అన్నారు. రేషన్ బియ్యం అందడం లేదని వచ్చిన సమాచారం మేరకు మంగళవారం సీపీఎం ప్రజా ప్రతినిధులు రేగులపాడు పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకానికి రేషన్ బియ్యం ఇవ్వకపోవడాన్ని ప్రత్యక్షంగా చూశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ ప్రతి నెలా థంబ్ పెట్టించి బియ్యం మాత్రం ఇవ్వడం లేదన్నారు. దీంతో పాఠశాలల్లోని పిల్లలు తమ ఇంటి నుంచి భోజనం తెచ్చుకొని తింటున్నారని పేర్కొన్నారు. పేదల ప్రభుత్వం అనే చెప్పే వైసిపి నాయకులకు గిరిజన ప్రాంత పిల్లలు ఆకలితో ఉంటే కనపడడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికే మిడ్డేమీల్స్ కార్మికులు అప్పులు తీసుకుని వంట చేసి పెడుతున్నారని తెలిపారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలకు మిడ్డేమీల్స్‌కు ఇవ్వాల్సిన బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతా రామయ్య, సర్పంచులు బొగ్గా వెంకమ్మ, నాగమణి, బొగ్గా సుబ్బయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మలుపులు తిరుగుతున్న మోతుగూడెం గంజాయి కేసు

ప్రజాశక్తి-చింతూరు

ఈ నెల 17న శనివారం మోతుగూడెం 327 ఐఎన్‌టియుసి కార్యాలయంలో పోలీసులకు దొరికిన గంజాయి కేసు విచారణ రోజు రోజుకు కొత్త మలుపులు తిరుగుతుంది. విచారణలో నిందితుల జాబితా చూసి పోలీసులు ఖంగుతిన్నారు. ఒక యూనియన్‌కు చెందిన నాయకులే మరో యూనియన్ కార్యాలయంలో గంజాయి ఏర్పాటు చేసి కేసులో ఇరికించినట్లు సమాచారం. నిందితులు ఏపీ జెన్‌కోలో మంచి స్థాయి ఉద్యోగాలు చేస్తూ ఒక యూనియన్‌కి నాయకత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. వీరికి మాదక ద్రవ్యాల వ్యాపారంలో కూడా మంచి ప్రావీణ్యం ఉందని, ఇప్పటికే రాజమండ్రి తదితర పట్టణాల్లో కోట్ల రూపాయల విలువ చేసే నివాసాలు వీరు నిర్మించినట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు. అక్రమ సంపాదనలో వచ్చిన తగాదాల వల్లే ఇప్పుడు పోలీసుల చేతికి చిక్కినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. నిందితులను ప్రస్తుతం విచారణ నిమిత్తం చింతూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు విచారణలో మరెన్ని ఆసక్తికర విషయాలు వస్తాయో వేచిచూడాలి.

మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి సమక్షంలో టిడిపి చేరిన దృశ్యం

టిడిపి విజయం ఖాయం

ప్రజాశక్తి-రంపచోడవరం

రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. మండలంలోని ఆకూరు, వేమలకొండ పంచాయితీల పరిధిలోని యార్లమామిడి, దబ్బవలస గ్రామాలలో బాబు షూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రాజేశ్వరి ఆరు సంక్షేమ గ్యారెంటీ పత్రాలు ప్రజలకు పంచారు. ఈ సందర్భంగా దబ్బవలస గ్రామానికి చెందిన వైసీపీ, సిపిఐ ఎంఎల్ పార్టీల నుండి 36 కుటుంబాలు రాజేశ్వరి సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం రాజేశ్వరి మాట్లాడుతూ ప్రజల కష్టాలు తీరాలన్నా, యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా, రానున్న ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాధవరెడ్డి, టిడిపి నాయకులు పెంటపాటి అనంత మోహన్, కారం సింహాచలం, కారం శేషయ్యమ్మ, కుంజం బాపన్న దొర, ధార వెంకన్న, కోసు నాగన్న దొర, చక్రపాణి, పండా కృష్ణమూర్తి, ఉగ్గిరాల భాస్కర్, నెరం వీరాస్వామి, ముర్ల అన్నవరం, జనసేన నాయకులు రవి, నేరం అబ్బులు, అప్పారావు, చాదల సత్యనారాయణ, నెల్లూరి రామిరెడ్డి, బోదులురి వీరపురెడ్డి, బోదులురి స్వామిరెడ్డి, వంజం బాలుదొర, మిర్తివాడ బసవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి- కొయ్యూరు

కొయ్యూరు మండలం, డౌనూరు పంచాయతీ పరిధి తులబాడగెడ్డ, రొబ్బసింగి, ములగలమెట్ట గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవో విజయ కుమారి సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. త్వరలో ఆర్థిక సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా, తిరిగి నూతన ఆర్థిక సంవత్సరంలో అంగన్వాడీ లబ్ధిదారులకు పథకాలు అందాలంటే, లబ్ధిదారుల అకౌంట్, ఆధార్ నెంబర్ అప్డేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, పిల్లలు, గర్భిణులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న సిడిపిఒ విజయకుమారి

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు

ఆశ్రమాల ప్రధానోపాధ్యాయులదే పూర్తి బాధ్యత

హెచ్‌ఎంలు, డిప్యూటీ వార్డెన్లతో సమీక్షలో పిఒ అభిషేక్

ప్రజాశక్తి- పాడేరు : గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ తీవ్రమైన హెచ్చరికలు చేసారు.మంగళవారం. ఐటిడిఎ సమావేశ మందిరంలో సహాయ గిరిజన సంక్షేమాధికారులు, గురుకులం ప్రిన్సిపాల్స్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లతో ఆశ్రమ పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న ఆరోగ్య సేవల, ఇటీవల విద్యార్థుల మరణాలపై మండలాల వారీగా సమీక్షించారు. విద్యార్థులకు జ్వరాలు సోకినా, అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు చోటుచేసుకోవడంపై తీవ్రమైన అసంతప్తి వ్యక్తం చేసారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మరణిస్తే సంబంధిత ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేసి ప్రభుత్వానికి సరెండరు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు మరణిస్తే వెంటనే డిడికి సమాచారం అందించాలని స్పష్టం చేసారు. విద్యార్థుల మరణాలపై డెత్ ఆడిట్ చేస్తామన్నారు. ప్రతి చిన్న విషయానికీ పోరాటాలు చేస్తారని విద్యార్థులు మరణాలపై ఎందుకు పోరాటాలు చేయడం లేదని ప్రశ్నించారు. గిరిజన విద్యావ్యవస్థపై ప్రజలలో నమ్మకం పెరిగేలా పనిచేయాలన్నారు పాడేరులోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక వార్డు ఏర్పాటు చేయాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించామన్నారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యార్థినీ విద్యార్థుల ఎక్కడ, ఎప్పుడు, ఎలా, మరిణించారు ? వ్యాదులు వచ్చినపుడు అందించిన వైద్య సేవలపై ఆరా తీసారు. విద్యార్థుల్లో చర్మవ్యాధుల నివారణకు రూ.5.50 లక్షల వ్యయంతో సబ్బులు పంపిణీ చేసామన్నారు. ఆశ్రమ పాఠశాలలు సందర్శించినపుడు సమస్యలను తన దృష్టికి తీసుకురావడం లేదన్నారు.. ప్రధానోపాధ్యాయుడి ఆదేశాలు, ఉపాధ్యాయులు తప్పకుండా పాటించాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే తన దష్టికి తీసుకుని వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ వార్డెన్ పోస్టుల మీద ఉన్న ఉత్సాహం పిల్లల ఆరోగ్యంపై లేదన్నారు. దీనికి సంబంధించి సిఫారసులు చేస్తే సస్పెండ్ చేస్తామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ప్రధానోపాధ్యాయులు సమన్వయం కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వైద్యం అందించడానికి విద్యార్థులను తీసుకుని వస్తే వెంటనే ఉప సంచాలకులు, ఎటిడబ్ల్యూఒలకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులెవరైనా రెండు రోజులు జ్వరంతో బాధపడితే వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించాలని ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనీమియా, మానసిక వ్యాదులతో బాధపడే విద్యార్థుల ఆరోగ్యంపై పేరుపేరునా ఆరా తీసారు. హృదయ సంబంధిత వ్యాదులు, మానసిక రుగ్మతులతో బాధపడే విద్యార్థులను గుర్తిస్తే ప్రత్యేక వైద్యం అందిస్తామని డబ్బు సమస్య లేదని వివరించారు.. అవసరమైతే గుండె ఆపరేషన్ చేయిస్తామన్నారు.ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందించినా బిల్లులు చెల్లిస్తామన్నారు. చెప్పారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా పని చేయాలని స్పష్టం చేసారు. ప్రధానోపాధ్యాయులు సెలవు పెడితే పిఒ అనుమతి తీసుకుని ప్రత్యామ్నాయంగా ఇన్చార్జి హెచ్ఎం.ను నియమించాలని డిడిని ఆదేశించారు. ఉపాధ్యాయులు మద్యం తాగి విధులకు హాజరవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోవాలని స్పష్టం చేసారు. విద్యార్థుల హాజరు సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల నిర్వహణపై సరైన సమాదానాలు చెప్పలేదని కొయ్యూరు గిరిజన సంక్షేమ ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. దేవమూర్తి, హుకుంపేట బాలుర ఆశ్రమ పాఠశాల బాలురు-2 ప్రధానోపాధ్యాయుడు శోభా నాగభూషణంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉపసంచాలకులను ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలకు సంబంధిత ప్రధానోపాధ్యాయులను నోడల్ అధికారులుగా నియమిస్తూ సమావేశంలో ఉత్తర్వులు జారీ చేసారు. ఐటిడిఎలో 24గంటలూ అందుబాటులో ఉండే హెల్ప్ కాల్ సెంటర్ సేవలను వినియోగించు కోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. 1800 4250 0004 నెంబరు కాల్ చేయాలన్నారు. అనారోగ్యంగా ఉన్న విద్యార్థులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచిస్తే, హాస్టల్‌లోనే ప్రత్యేకంగా సిక్ రూం ఏర్పాటు చేయాలని, ఇళ్లకు పంపించ కూడదన్నారు. తలిదండ్రులకు నాటు వైద్యం వాడకుండా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశం లో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ. కొండల రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. సలీం భాషా, ఎటిడబ్ల్యూ ఓలు ఎల్.రజని, మల్లిఖార్జున రావు, వెంకట రమణ, క్రాంతి, 11 మండలాల ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్, డిప్యూటీ వార్డెన్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

సమావేశానికి హాజరైన డిప్యూటీ వార్డెన్లు, హెచ్‌ఎంలు

ఘనంగా గంగమ్మ తల్లి వార్షికోత్సవం

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని సీకరి గ్రామంలో గంగమ్మతల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల వేడుకలో భాగంగా పెదబయలు, గంపరాయికి చెందిన. శ్రీరామ యువజన భజన బృందం, హుకుంపేట మండలం బాకూరుకు చెందిన సీతారాముల భజన సంఘం, శోభకోటకు చెందిన మరో భజన బృందం సభ్యులు ఆలయ మండపంలో సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటలు వరకు ఏకధాటిగా భక్తి గీతాలతో భజన నిర్వహించారు. మంగళవారం ఉదయం గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సీకరి పురవీధులలో ఊరేగించారు. ముగింపు వేడుకలో జి.మాడుగుల మండలం కె.కోడాపల్లికి చెందిన కోలాటం, గిరిజన సాంప్రదాయ థింసా నృత్యాలు, జానపద నృత్యాలతో వేడుక వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భజన, కోలాటం బృందాలతోపాటు థింసా నృత్యకళాకారులను పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాతో సత్కరించారు. ఉత్సవాల నిర్వహణకు ఆర్థికసాయంతోపాటు, కళాకారుల సత్కారానికి 27శాలువాలు అందించిన విశాఖపట్నానికి చెందిన వాణిజ్యపన్నులశాఖ అధికారి ఎటి.వెంకటేశ్వర్లు, అడపా నర్సమ్మ దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో సీకరి భీమలింగేశ్వరస్వామి, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సీకరి వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దార్ సీకరి పిన్నయ్య దొర, మాజీ సబ్ పోస్ట్‌మాస్టర్ వనలభ సన్యాసి, మాజీ సర్పంచ్ సీకరి చిరంజీవిదొర, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు సీకరి వెంకటప్రసాద్, ఆలయ పూజారి మంత్రి జగన్నాథం, కమిటీ సభ్యులు సీకరి జనార్ధన్ దొర (జాన్), వంటారి చంటి, సీకరి శ్రీనివాస్‌దొర, గ్రామప్రజలు, యువత, మహిళలు పాల్గొన్నారు,

114 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - దుంబ్రిగుడ : మండలంలోని అరకు సంతబయలు గ్రామం వద్ద ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 114 మందికి వైద్యనిపుణులు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 18మందికి అంతరకుసుమాలున్నట్లు గుర్తించి, కంటి ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. గత వైద్యశిబిరం దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన వారికి ఇపుడు ఉచితంగా కళ్లద్దాలు పంపిణి చేశారు. శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ జి శారద మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో కంటిరోగులకు ఎల్‌వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో వైద్యశిబిరం నిర్వహించి సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆప్తోమెట్రిస్ట్ వై శ్రీకృష్ణ, టెక్నీషియన్లు పివి సత్యనారాయణ, సాయికుమార్, రాజు, ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న ఎల్‌విప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది

ఘనంగా అడవి రాజబాబుల పండగ

ప్రజాశక్తి - చింతపల్లి : అడవి రాజబాబుల పండుగను స్థానిక నెయ్యల వీధి వాసులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.కొన్నేళ్లుగా సాంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్న ఈ పండుగలో కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేశారు. స్థానిక నెయ్యిలవీధి అధ్యక్ష కార్యదర్శులు ఇంటి యేసు, ఆబోతు కొండబాబు ఆధ్వర్యంలో కులపెద్ద పి కామేశ్వరరావు సమక్షంలో జోడు మామిళ్ళ వక్షాల చెంత ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అన్నసమారాధనలో పాల్గొన్న ప్రజలు

సెల్‌టవర్ నిర్మాణం పూర్తి చేసేదెన్నడో?

ఏడాదిగా నిలిచిన పనులు: సిగ్నల్స్‌కు జనం అవస్థలు

తక్షణం పూర్తిచేయాలి : ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని బొండాం పంచాయతీ కొత్తవలస గ్రామంలో నిర్మిస్తున్న బిఎస్ఎన్ఎల్ టవర్ పనులను త్వరితగతని పూర్తి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గత్తుం బుజ్జిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం అసంపూర్తిగా ఆగిన బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ఏజెన్సీవాసులకు మెరుగైన సిగ్నల్స్‌తో సెల్‌సేవలను అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశ్యంతో గతేడాది కొత్తవలస గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ మంజూరు చేయగా, సంబంధిత కాంట్రాక్టర్ సెప్టెంబర్ నెలలో పనులు ప్రారంభించి, పునాదులు వరకు కాంక్రిట్ పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశాడన్నారు. దీంతో సెల్‌సేవలుఅందుబాటులోకి వస్తాయన్న గిరిజనుల ఆశలు నెరవేరకపోగా, ప్రభుత్వ పథకాల ఇకెవైసికి నాలుగైదు కిలోమీటర్లు దూరంలో కొండలపైకెక్కి పడిగాపులు పడాల్సి వస్తోందనిఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ వ్యాప్తంగా 400 సెల్ టవర్లను ఒక్కొక్కటీ రూ.కోటి వ్యయంతో నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింద సంబంధిత కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వలన పనులు ముందుకు సాగకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వీటిపై దృష్టి పెట్టి, సెల్‌టవర్లను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ గిరిజన సంఘం నాయకులు టి దేవరాజు, జి రవీంద్రబాబు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న సెల్‌టవర్ పనులు పరిశీలిస్తున్న బుజ్జిబాబు

మత్స్యలింగేశ్వరున్ని దర్శించుకున్న కలెక్టర్

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీలోని ప్రముఖ పుణ్య క్షేత్రం మత్స్యగుండంలోని మత్స్యలింగేశ్వరస్వామిని మంగళవారం అల్లూరి జిల్లా నూతన కలెక్టర్ వి.విజయ సునీత కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, మత్స్యగుండంలోని చేపలకు ప్రసాదాన్ని అందించి ఆనందపరవశులయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ సునీతను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి, ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో మఠం పంచాయతీ సర్పంచ్ మఠం శాంతకుమారి, ఆలయ కమిటీ ప్రతినిధులు తమర్భ అప్పారావు, మినుముల గోపాల పాత్రుడు, పాంగి మత్స్య కొండబాబు, మఠం సింహాచలం నాయుడు, మఠం రమేష్ నాయుడు, మఠం రాంబాబు నాయుడు, తమర్భా భీంబాబు, వంతల ఈశ్వర్, అల్లంగి బాలయ్య, విఆర్ఒ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

కలెక్టర్‌కు జెడ్‌పి చైర్‌పర్సన్ అభినందన

పాడేరు : అల్లూరి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ సునీతను ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగాపుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు.

విద్యార్థులతో ముచ్చటిస్తున్న పిఒ సూరజ్ గనోరే

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-రంపచోడవరం : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యే విధంగా ఉపాధ్యాయులు వారికి ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలం ఇర్లపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పదో తరగతి విద్యార్థుల క్లాస్ రూములను పరిశీలించి విద్యార్థులు ఏవిధంగా చదువుతున్నదీ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు వచ్చేందుకు ఏ విధంగా పరీక్షలు రాయాలో సూచించారు. ప్రతిరోజు ప్రభుత్వ నిబంధన ప్రకారం మెనూ అమలు చేయాలని ఆదేశించారు. టెండర్లకు అనుగుణంగా నిత్యవసర సరుకులు, కాయగూరలు, వారానికి రెండు రోజులు కోడి మాంసం ఏ విధంగా సరఫరా చేస్తున్నారో ఆరా తీశారు. అనంతరం స్టాకు రికార్డులను పరిశీలించి రివ్యూ చేశారు. పిఒ వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అబు సలాం, ఏటిడబ్ల్యూఓ రామతులసి, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవివి సత్యనారాయణ

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గం 17వ వార్డు ఆదర్శ నగర్ కాలనీలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు రూ.25 లక్షలతో విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ కార్పొరేటర్ గేదల లావణ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం వార్డులో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు రాంబాబు, మనోహర్, విశాఖ మాజీ మార్కెటింగ్ డైరెక్టర్ పిల్లా సత్యవతి, నీలా రెడ్డి, కాళ్ళ వరహాలు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో నవ్య సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని కేన్సర్ సేవల్లో నవ్యతకు అంకురార్పణ జరిగింది. కేన్సర్ రోగుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుగు కృషి చేస్తున్న జాతీయ స్థాయి స్వచ్ఛంద సేవా సంస్థ 'నవ్వ'తో పాటు బాధితుల ప్రాణాలు కాపాడేందుకు పాటుపడుతున్న టాటా మెమోరియల్ ఆసుపత్రి సౌజన్యంతో నేషనల్ కేన్సర్ గ్రిడ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కెజిహెచ్‌లో నవ్య ప్రాజెక్టు కార్యకలాపాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టాటా మెమోరియల్ అనుబంధ హోమీ బాబా కేన్సర్ రీసెర్చ్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.బుచ్చిరాజు పాల్గొన్నారు.

చప్పగా శంఖారావం

విమర్శలకే ప్రాధాన్యం - కానరాని అభివృద్ధి అజెండా

సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపై నోరుమెదపని లోకేష్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రలో పాత అంశాలే తప్ప కొత్త ఆలోచనలు రేకెత్తించే అంశాలేవీ లేవు. ప్రభుత్వంపై విమర్శలు, ఆకర్షణీయ ప్రతిపాదిత పథకాలు తప్ప శాశ్వత అభివృద్ధికి దోహదపడే ప్రకటనలు చేయలేదు. హామీలు ఇవ్వలేదు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కార్యకర్తలు కలిసి పనిచేసే వాతావరణం కిందిస్థాయిలో కలిగించేందుకు చేసిన ప్రయత్నంలా లోకేష్ శంఖారావం కొనసాగింది తప్ప అధికారంలోకి వస్తే తమ ప్రభుత్వం చేపట్టేబోయే అభివృద్ధి నమూనా ఎలావుండబోతుందో చెప్పలేదు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ రైతులను ఆదుకుంటామన్న ఆయన... ఆధునీకీకరించి పునరుద్ధరిస్తామన్న హామీ ఇవ్వలేదు. ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలు వైసిపి ప్రభుత్వంలో మూతపడ్డాయని విమర్శలు చేశారు తప్ప తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని తెరిపించి రైతుల అవసరాలకు తగినట్లు తిర్చిదిద్దుతామని చెప్పకపోవడంతోనే చక్కెర ఫ్యాక్టరీల పట్ల టిడిపి వైఖరి మరోసారి స్పష్టమైంది. ఆయా నియోజకవర్గ సభల్లో ఎమ్మెల్యేలపై విమర్శలకు లోకేష్ పరిమితమయ్యారు తప్ప నియోజకవర్గంలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తమ అజెండాను వివరించలేదు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సహా ఏలేరు, తాండవ అనుసంధానం, పోలవరం ఎడమ కాలువ పనులు, నిర్వాసితుల సమస్యలు, పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి, కనీస వేతనాలు అమలు, నాన్‌షెడ్యూల్ ప్రాంతాన్ని ఐదో షెడ్యూల్‌లో చేర్చడం, కాలుష్య నియంత్రణ చర్యలు, పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ వంటి పలు ప్రధానాంశాలను ఆయన విస్మరించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న మోడీ ప్రభుత్వంపై పల్లెత్తుమాట అనలేదు. తీర ప్రాంతంలో రసాయన పరిశ్రమల కారణంగా దెబ్బతింటున్న మత్స్యకారుల జీవనోపాధి పరిరక్షణకు ఎటువంటి భరోసా ఇవ్వలేదు. ఎన్నికల్లో గెలిపించాలని పదేపదే అభ్యర్థించడమేగానీ, గెలిపించిన ప్రజలను ఎలా ఉద్ధరించబోతున్నదీ చెప్పే ప్రయత్నం చేయలేదు. వైసిపి ప్రభుత్వం కంటే వివిధ పథకాల కింద ఎక్కువ ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామని ప్రజలను నమ్మించడానికి లోకేష్ ప్రయత్నించారు.

మాట్లాడుతున్న నారా లోకేష్

కాంగ్రెస్ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో అప్పలాచారి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసే అవకాశం తనకు కల్పించాలని కోరుతూ కెజిహెచ్ విశ్రాంత అధికారి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధి తాళాబత్తుల అప్పలాచారి దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా విజయవాడ గాంధీభవన్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులతో కలిసి తన దరఖాస్తును ఉత్తరాంధ్ర ఇంచార్జ్, ఎఐసిసి ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీరామ్‌కు అందజేశారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

భూములమ్మి స్టీల్‌ప్లాంట్ రక్షణ సాధ్యమేనా ?

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 'మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు భూములమ్మి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించగలదా.. నడిపించగలదా.. ! ఇది సాధ్యమయ్యే పనేనా..? మనిషికి రోగం ఒకటైతే మందు ఒకటి వేసినట్లు కేంద్రం చర్యలు ఉన్నాయి' అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన పార్టీ జిల్లా కమిటీ తరుపున ఓ ప్రకటన విడుదల చేశారు. ప్లాంట్ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ఐదు వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని కార్మికుల న్యాయమైన డిమాండ్‌గా ఉందన్నారు. లేనిపక్షంలో బ్యాంకుల నుండి రుణం ఇప్పించాలని కోరుతున్నారన్నారు. మూడు లక్షల కోట్ల విలువగల స్టీల్‌ప్లాంట్ ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. దీనికి కేవలం రూ.5000 కోట్లు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు అభ్యంతరమని ప్రశ్నించారు. బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా ఎందుకు ఆటంకపరచాలన్నారు. కార్పొరేట్ మిత్రులకు లక్షల కోట్లు రుణాలు, పన్ను రాయితీలను కేంద్రం ఇస్తోందని తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం ఏ విధమైన సాయమూ అందించడం లేదన్నారు. ప్లాంటును ఆర్థికంగా దెబ్బతీసి, నష్టాలపాలు చేసి తన కార్పొరేట్ మిత్రులకు కారుచౌకగా కట్టబెట్టాలన్న కుట్ర ఇందులో స్పష్టంగా దాగి ఉందని జగ్గునాయుడు తెలిపారు. ప్లాంటుకు విశాఖ నగరం, ఆటోనగర్ ప్రాంతాల్లోని ఉన్న భూములను ప్రభుత్వం వేలం వేస్తోందని, అలా భూములు వేలం వేసి, ఆస్తులు అమ్ముకుంటూ పోతే ప్లాంటును ఎంతకాలం నడపగలరు.. రక్షించగలరని అన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ 3ని జిందాల్‌కు కట్టబెడితే ఉత్పత్తి బాగా పెరుగుతుందని, ఇది సర్వరోగ నివారిణి అని కేంద్ర బీజేపీ ప్రభుత్వం, స్టీల్ యాజమాన్యం ఊదరగొట్టాయన్నారు. దీనిని కట్టబెట్టి రెండు నెలలు అయిందని, పూర్తి ఉత్పత్తి చేయగలుగుతున్నారా ? అని ప్రశ్నించారు. ఇది జిందాల్ సంస్థకు ప్రయోజనం తప్ప ప్లాంట్‌కు, కార్మికులకు ఏం ప్రయోజమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, వర్కింగ్ క్యాపిటల్ అందించి, ప్లాంట్‌ను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించడానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా సహకరిస్తే సంవత్సరంలో లాభాలు బాట పట్టిస్తామని స్టీల్ కార్మికుల రోదన మోడీ ప్రభుత్వం ముందు అరణ్య రోదనగా ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర బిజెపి ప్రభుత్వం త్యాగాల విశాఖ ఉక్కును బలహీనపరిచే చర్యలను, కుట్రలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సంస్థకు వర్కింగ్ క్యాపిటల్ సహా పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించేందుకు అన్ని చర్యలు తక్షణమే చేపట్టాలని కోరారు.

కేంద్రీయ విద్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

కేంద్రీయ విద్యాలయం మూసివేతపై ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : కేంద్రీయ విద్యాలయం మూసివేత ప్రతిపాదనను తక్షణం విరమించుకోవాలని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల ఆధ్వర్యంలో ఉక్కునగరం కేంద్రీయ విద్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బయట ప్రచారంలో ఒకరకంగానూ, ఆచరణలో వేరొక రకంగానూ వ్యవహరిస్తోందని విమర్శించారు. నిర్వాసితులు, ఉక్కు ఉద్యోగుల పిల్లలకు విద్య అందించాల్సిన ప్రధాన బాధ్యత నుంచి యాజమాన్యం తప్పుకోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. కనుక ఇటువంటి ప్రతిపాదనలను యాజమాన్యం తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ దీనిని 1983లో ప్రారంభించారని, 1050 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. వీరి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే యాజమాన్య వైఖరి అత్యంత దుర్మార్గమని వివరించారు. కేంద్రీయ విద్యాలయానికి నేటి వరకు యాజమాన్యం అందిస్తున్న ఆర్థిక సహాయ సహకారాలు ఇకపైనా అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ఇప్పటి నుంచే రానున్న విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఇవ్వట్లేదని తీవ్రంగా విమర్శించారు. విద్యార్థుల సంఖ్య ఒక సెక్షన్‌కు 40కి మించరాదని, కానీ నేడు అది 80 వరకూ ఉందని అన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య కూడా తక్కువుగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, మిత్రపక్షాల నాయకులు డివి.రమణారెడ్డి, శ్రీనివాస్, మొహిద్దిన్, మహేష్, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు నవ్య, జ్యోతి, పద్మావతి, హేమ, వినీల, తారకేష్, ప్రసాద్, ప్రదీప్, భాస్కర్, సత్యానంద, ప్రతాప్ పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన సీతంరాజు సుధాకర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపికి రాజీనామా చేసి, ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేని బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సీతంరాజు సుధాకర్ మంగళవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశారు. అనకాపల్లి జిల్లా మాడుగులలో సోమవారం టిడిపి సమావేశంలో పాల్గొన్న లోకేష్ ఆరోజు రాత్రి అక్కడే బస చేశారు. దీంతో మంగళవారం ఉదయం సీతంరాజు సుధాకర్ అక్కడే లోకేష్‌ను కలిశారు. రానున్న ఎన్నికల్లో అవకాశం ఇస్తే తెలుగుదేశం పార్టీ తరపున విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తానని, తనకు అవకాశం కల్పిస్తే అక్కడ విజయం సాధించి వస్తానని వివరించారు. నియోజకవర్గంలో గత కొన్నాళ్లుగా తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరిస్తూ, ఒక నివేదికను అందజేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నియోజవర్గంలో సేవా కార్యక్రమాలను కొనసాగించాలని, ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉండాలని లోకేష్ చెప్పినట్లు తెలిసింది. అయితే టిక్కెట్‌పై ఎటువంటి హామీ ఇవ్వలేనట్లుగా తెలిసింది. లోకేష్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా ఉన్నాయని సుధాకర్ తెలిపారని ఆయనకు మద్దతు ఇస్తున్న ఒక కార్పొరేటర్ ప్రజాశక్తికి తెలిపారు.

జివిఎంసి అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జివిఎంసి స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి వెల్లడించారు. మంగళవారం ఆమె అధ్యక్షతన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. 136 అజెండాలతో పాటు 51 టేబుల్ అజెండాలతో కలిపి మొత్తం 187 అంశాలు పొందుపరిచారు.